క్లుప్తంగా

అర్బన్ ఎస్ఐగా అరుణ్‌రెడ్డి



పులివెందుల: పులివెందుల అర్బన్ ఎస్ఐగా అరుణ్‌రెడ్డి సోమవారం బాధ్య తలు చేపట్టారు. కడప వీఆర్ నుంచి పులివెందుల అర్బన్ ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ శ్రీలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో ఓసీకి సంబంధించి అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులో ఓసీకి సంబంధించిన అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 30లోపు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాన్నారు. 21ఏళ్ల నుంచి 35ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు యు. రాజుపాలెంలో ఏపీకి జగన్ ఎందుకు కావాలి

వీరపునాయునిపల్లె: మండలంలోని యు.రాజుపాలెంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏపీకి జగన్‌మోహన్‌రెడ్డి కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటాలని.. సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

కల్లూరుపల్లె వాసికి జ్యోతిరావు పూలే అవార్డు



మహాత్మ జ్యోతిరావు పూలే అవార్డును అందుకుంటున్న సభాపతి నాయుడు

చక్రాయపేట: మండలంలోని కల్లూరుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మండల మాజీ ఉపాధ్యక్షుడు పాల ఏకిరి సంఘం డైరెక్టర్ సభాపతి నాయుడుకు మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ సామాజిక రాజకీయ సేవకు గాను తనకు ఈ అవార్డు వచ్చినట్లు సభాపతి నాయుడు తెలిపారు. డిల్లీలోని ఆంధ్రభవన్‌లో గల గురజాడ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన లీగల్ సర్వీసెస్ రైట్స్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో ఏపీ బీసీ కమిషన్ సభ్యులు యం.కృష్ణప్ప చేతుల మీదుగా అవార్డు అందుకున్నానని వివరించారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్

జమ్మలమడుగు: శాంతియుత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుందామని అర్బన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. సోమవారం ప్రొద్దుటూరు రహదారిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ శ్యాంసోన్, డాక్టర్ ఆగస్టీన్ రాజు ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభించారు.. అనంతరం కొవ్వత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీజే సైమన్, మధుబాబు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మంగళ గౌరీగా అమ్మవారు



మంగళ గౌరిదేవి అలంకరణలో అమ్మవారు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరిదేవి ఆలయంలో కార్తీక మహోత్సవాలలో భాగంగా అమ్మవారు మంగళ గౌరిదేవి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్‌శర్మ, సత్యనారాయణాచార్యులు నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా శ్రీ గౌరమ్మ ప్రతిష్టాపన

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం మెయిన్ బజార్‌లోని శ్రీ కన్యాకపరమేశ్వరీ ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం పసువు గౌరమ్మ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా జరిగింది.

నెలరాజే మురిసేలా..
ఇలపై కార్తీక దీప వెలుగులు



పెద్దపుత్త శివాలయంలో దీపాలతో శివ లింగం

కాంతిపుంజమేదో నేల దిగినట్లు.. నలుదిక్కులా కార్తీక దీపాల వెలుగులు. పున్నమి చంద్రుడు సైతం చిన్నబోయి 'ఇల'వంక చూసేలా.. బంగారు వర్ణంలో మెరిసిన శైవక్షేత్రాలు.. పంచాక్షరి నామంతో ప్రతిధ్వనించిన కొండాకోనలు. వెరసి కార్తీక మాసం రెండో సోమవారం, పౌర్ణమిని పురస్కరించుకుని పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగులోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ప్రాతఃకాల పూజలతో.. రుద్రాభిషేకాలతో ఆధ్యాత్మిక శోభతో అలరారాయి. అర్చన.. అన్నదానాలతో ఆలయాలు సందడిగా మారాయి. పలుచోట్ల లక్ష దీపార్చాన చేశారు.



లింగాల: లక్ష దీపార్చన



వల్లూరు: పుష్పగిరిలో భక్తులతో కళకళలాడిన పెన్నాతీరం..



పులివెందుల టౌన్: శ్రీమిట్టమల్లేశ్వరస్వామి



సింహాద్రిపురం: స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో నిలబడిన భక్తులు



సింహాద్రిపురం ప్రత్యేక అలంకరణలో భానుకోట సోమేశ్వరస్వామి మూల విరాట్



జమ్మలమడుగు కన్యతీర్థంలోని బాల త్రిపుర,సుందరి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



లింగాల: కోన మల్లేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం



వీరపునాయునిపల్లె: సంగమేశ్వరాలయంలో శివ పార్వతుల కళ్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



సింహాద్రిపురం: ఆలయంలో వెలిగిస్తున్న జ్వాలా తోరణం



చక్రాయపేట: పంచసూక్త హోమంలో అర్చకులు



పొలతల క్షేత్రంలో భక్తుల సందడి

భానుకోట క్షేత్రంలో లక్ష దీపారాధన

సింహాద్రిపురం మండలంలోని భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంలో లక్ష దీపారాధన మహోత్సవం నిర్వహించారు. ఉచిత హరిశ్చంద్ర నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాత్రి జ్వాలా తోరణాన్ని నిర్వహించారు.

శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని కనంపల్లె గ్రామ సమీపంలో ఉన్న సిద్ధలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున నుంచి మహిళలు అధిక సంకార్తీక దీపాలను వెలగించారు.

కన్నుల పండువగా శివ పార్వతుల కళ్యాణం

వీరపునాయునిపల్లె: అనిమెల గ్రామం సమీపంలో సంఘమేశ్వరుని ఆలయంలో శివ పార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది.

- యన్ పాలగిరి క్రాస్ వద్ద కాశిరెడ్డినాయన ఆలయంలో కార్తీక సోమవారం వేడుకలను నిర్వహించారు.

శివనామస్మరణ

లింగాల : మండలంలోని పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయం, లింగాల, బోనాల, వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె, అంబకపల్లె, దొండ్లవాగు, ఇప్పట్ల, మురారిచింతల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక దీపాలను వెలగించారు. కోన మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కళకళలాడిన శైవ క్షేత్రాలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూకట్టారు. పట్టణంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు భీమలింగస్వామి శివున్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిశాల ఖగేశ్వరస్వామి, కడపరోడ్డు, పార్నపల్లెరోడ్డులోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నామాలగుండు సిద్ద లింగేశ్వరస్వామి, పంచలింగాలకోన, గుండాలయ కోన శివాలయాలు, కోన గవేశ్వరాలయం శివాలయాలు భక్తులతో కనువిందుచేశాయి.

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

జమ్మలమడుగు: మండల పరిధిలోని అతిపురాతనమైన కన్యతీర్థంలో బాల త్రిపుర సుందరి సుందరేశ్వరుల ఆలయం ధ్వజ స్థంభం ముందు కార్తీక దీపాలు వెలిగించారు. పట్టణంలోని సోమేశ్వర ఆలయంలో, జంబులింగేశ్వర, కన్నెలూరులోని రామలింగేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు పెన్నానదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగిరిని సందర్శించారు. పెద్దపుత్త, పెద్ద లేబాక, అంబవరం, పైడికాలువ తదితర గ్రామాలలోని శివాలయాలలో పూజలు చేశారు.

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలో భక్తుల సందడి ఎక్కువైంది. భక్తులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతి దేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొండూరు: తొండూరు మండలంలోని గవిలింగేశ్వరస్వామి ఆలయం, మల్లేల దేవరకోనలోని కత్తి మల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చక్రాయపేట : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం కార్తీక మాస పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ అలవలపాటి ముకుందారెడ్డి పేర్కొన్నారు. మహాపూర్ణాహుతితో వేడుకలు ముగిశాయన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే



న్యాయవాదులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు రూరల్: చట్టానికి ఎవరు అతీతులు కారని చట్టం ముందు అందరు సమానులే అని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్ట్ జడ్జి ఎస్.భార్గవి అన్నారు. న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కోర్ట్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడూతూ భారత దేశ రాజ్యాంగము ఎంతో శక్తివంతమైనదని ఇతర దేశాలు మన దేశాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఆమె సూచించారు. అలాగే వరకట్న వ్యతిరేక దినోత్సవం గురించి ఆమె తెలిపారు. అనంతరం న్యాయవాదులచే ఆమె ప్రతిజ్ఞ చేయించారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. చిన్న లక్షుమయ్య, న్యాయవాదులు కె. మురళీధర్‌రెడ్డి, ముని సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు: స్కానింగ్ సెంటర్‌లపై నిఘా పెట్టాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం లింగనిర్ధారణ, బేటీ బచావో- బేటీ పడావోపై సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టీమెంబర్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ చేయడం చట్టరిత్యానేరమన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులు స్కానింగ్ సెంటర్‌లలో లింగనిర్ధారణ చేస్తే అటువంటి వైద్యులకు జరిమానాలతోపాటు డాక్టర్ పట్టాను రద్దుచేస్తామని హెచ్చరించారు. సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న జేసీఎస్ పట్టణ కన్వీనర్ కిశోర్, కౌన్సిలర్ శైలజ

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జేసీఎస్ పట్టణ కన్వీనర్ పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్ గాజుల శైలజ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మిస్సమ్మ బంగ్లా సచివాలయ పరిధిలోని గాడిచర్ల వీధి, ముత్యాలవారి వీధి, శ్రీకృష్ణదేవరాయ నగర్ తదితర ప్రాంతాలలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జగనన్న అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, దబ్బయ్య, జయప్రకాష్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, సచివాలయ కన్వీనర్ నజీర్, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న అయ్యప్పభక్తులు

జమ్మలమడుగు రూరల్: పర్యాటక ప్రాంతమైన గండికోట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ రామగిరి అభయాంజనేయస్వామి అన్నదానం సత్రంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామికి అంబలం పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి అభిషేకాలు, 18 మెట్ల పడిపూజను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో దీక్షపరులు పాల్గొని స్వామి నామ స్మరణ చేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీ అయ్యప్పస్వామి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై కోడూరు గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజ, గ్రామోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అయ్యప్ప భక్తులు పడి పూజలో పాల్గొని కీర్తనలతో అలరించారు. సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

– మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, భాకరాపురంలో జరుగుతున్న సిమెంటు రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులను డిసెంబర్ నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని..అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మున్సిపల్ ఇంజనీర్ నిత్యానందరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఎల్‌ఏలకు ఓటర్ల జాబితా పంపిణీ

పులివెందుల టౌన్ : రాష్ట్ర ఎన్నికల సంఘం నూతనంగా జారీ చేసిన ఓటర్ల జాబితాను సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎన్నికల సంఘం అభ్యంతరాలను స్వీకరించి తప్పొప్పులను సరి చేశారన్నారు. ఆ ఓటర్ల జాబితాలో ఓటర్ల చిరునామా, వారి వివరాలను తెలుసుకుని ఓటర్లందరూ సక్రమంగా ఉన్నారా లేదా తదితర వాటిపై విచారించేందకు బీఎల్‌ఏలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ చివరి నాటికి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా సరి చూడాలని వారికి సూచించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు దుస్తుల పంపిణీ



పవన్ భార్గవ్‌రెడ్డి వర్ధంతిలో రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు

వేంపల్లె : అనాథ వృద్ధులకు దుస్తుల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కడప అక్కాయపల్లె గ్రామానికి చెందిన వడ్డెమాని పవన్ భార్గవ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా తల్లిదండ్రులు వి.లక్ష్మీదేవి, రామలింగారెడ్డి దంపతులు చింతకొమ్మదిన్నె గ్రామంలోని గంగమ్మ తోపులోని ఆంజనేయస్వామి ఆలయం, వేంపల్లె రాజీవ్‌కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం, కడప అజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమం, ఇందిరా నగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర ఉచిత వృద్ధాశ్రమాలలో అనాథ వృద్ధులకు వస్త్రదానం చేశారు. కుటుంబ సభ్యులు రాజరాజేశ్వరి, వెంకటసుబ్బారెడ్డి, వెంకట మోహిన్ష్‌రెడ్డి, అరుణ కుమారి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.